క్లుప్తంగా

బైక్‌ల వేలం



వేలం పాటలో దక్కించుకున్న వాహనాలతో పోలీస్ సిబ్బంది

జియ్యమ్మవలస: సారా కేసులలో పట్టుబడిన వాహనాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రెండు బైక్‌లు, ఒక ఆటోను గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేశారు. రెండు బైక్‌లను రూ.38,080లకు ఇద్దరు వ్యక్తులు వేలం పాటలో దక్కించుకోగా, ఆటోను రూ.51920లకు మరో వ్యక్తి దక్కించుకున్నట్లు ఎస్‌ఐ అనీష్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల ఆశ్రమ పాఠశాలలో 180 మంది విద్యార్థులకు రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలను గురువారం నిర్వహించారు. రక్త హీనతతో ఉన్న వారికి మందులను వైద్య సిబ్బంది సరఫరా చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం డి.పద్మ, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి



జగనన్న కాలనీల్లో నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ రఘురాం

కొమరాడ: ఉగాది నాటికి గృహ నిర్మాణాలన్నీ పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని గృహ నిర్మాణ శాఖ పీడీ పి.రఘురాం అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీఈ మోహన్‌రావు, ఏఈ రమణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



గోపాలపురంలో ఎస్‌డీజీ సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పాలకొండ రూరల్: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం గోపాలపురం సచివాలయాన్ని గురువారం సందర్శించారు. అక్కడి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరు, పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డీజీ, పీఎంజేఏవై సర్వే తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఎస్‌డీజీ సర్వేలో భాగంగా ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించాన్నారు. రానున్న వేసవిని అంచనా వేస్తూ నీటి వనరుల పురోగతిని పెంచాలని సూచించారు.

మోడల్ విద్యార్థులకు కంటి పరీక్షలు

భామిని: ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం క్రింద 694 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దృష్టి లోపాలు గల 64 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టి వైఎస్సార్ కంటి వెలుగు ఉచిత కళ్లద్దాలు అందించనున్నట్లు జానకి రామయ్య తెలిపారు. సాధారణ లోపాలు గల 43 మందికి మందులు అందజేశారు.

ఆంగ్ల టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మెళియాపుట్టిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాజెక్టు అధికారి బి.నవ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలిక ప్రాతిపదికన ఈ నియామకం ఉంటుందన్నారు. గెస్టు టీచర్‌గా పని చేయడానికి మహిళా అభ్యర్థి అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీలోగా పాతపట్నం వైటీసీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

- 4 లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కళావతి



బాధితులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: బాధితులకు అండగా సీఎం సహాయ నిధి నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గతేడాది జూలై 30న భామిని మండలం కోటకొండ గ్రామ సమీపంలో ఊట బావిలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు బాలికలు పాలక కీర్వి, ఆరిక అంజలి మృతి చెందిన విషయం విదితమే. బాలికల కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం సహాయనిధికి ఎమ్మెల్యే కళావతి ద్వారా వీరు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం వీరి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున సీఎం సహాయనిధి నుండి చెక్కులు రావడంతో ఆ చెక్కులను బాధిత కుటుంబాలకు చెందిన పాలక అప్పారావు, ఆరిక గుర్మకు వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి గురువారం అందజేశారు. వీరితో పాటు కార్యక్రమంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, బోనగడ్ల ధర్మారావు, బిడ్డిక అనంత్, బిడ్డిక తులసి, టింగ అన్నాజీరావు, ఆరిక జమ్మయ్య, గేదెల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశీస్సులతోనే కోలుకున్నా...

వీరఘట్టం: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై తిరిగి ఆరోగ్యవంతంగా మీ ముందుకు వచ్చానంటే ప్రజల ఆశీస్సులు, వారు చేసిన ప్రార్థనలే కారణమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. చిదిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత కాశీ సుందర విశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కళావతి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాల వల్లే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి వ్యక్తి తనకు ఫోన్ చేసి అక్కా ఆరోగ్యం జాగ్రత్త ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారని తెలిపారు. పాలకొండ నియోజకవర్గంలో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌తో మాట్లాడడం జరిగిందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న రోడ్లు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో వీరఘట్టం మండలంలో చిదిమి – పాలమెట్ట రోడ్డును రూ.1.48 కోట్లుతో, సీతంపేట మండలంలో ముత్యాలు జంక్షన్ – బొమ్మిక రోడ్డుకు రూ.2.50 కోట్లుతో, పాలకొండ మండలంలో అచ్చబ – జంపరకోట రోడ్డును రూ.1.40 కోట్లుతో, వీఆర్ రాజపేట – జంపరకోట రోడ్డును రూ.1 కోటితో, భామిని మండలంలో సింగిడి – బత్తిలి రోడ్డును రూ.1 కోటితో, జజ్జువా – బోయిన్నగూడ రోడ్డును రూ.1.10 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, జల వనరుల శాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ ఉన్నారు.



చిదిమి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్/కొమరాడ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు అన్నారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, కేఆర్‌బీపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సరిగ్గా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి నెలా ఆరోగ్య కేంద్రం వద్ద రక్త పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని, రక్తహీనత ఉన్న గర్భిణులకు ఇచ్చే మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని హితవు పలికారు. మూడు అంతకంటే ఎక్కువ ప్రసవాలు జరిగిన మహిళలు గర్భ నిరోధక ఆపరేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం మహాభాగ్యమని, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమని అన్నారు. ఇంటి ఇల్లాలు ఆరోగ్యం బాగుంటే కుటుంబ ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథ రావు

పట్టణంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: నగర పంచాయతీలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు కమిషనర్ సర్వేశ్వరరావును గురువారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి సీపీఎం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను రాత పూర్వకంగా సచివాలయాలకు, కమిషనర్‌కు అందించామని తెలిపారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధాన వీధి దీపాలు, తాగు నీరు, మురుగు కాలువలు, డంపింగ్ యార్డు తరలింపు తదితర అంశాలపై పాలకులు దృష్టి సారించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు కె.రాము, ఎ.లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రోగులకు మరింతగా 108 సేవలు

పాలకొండ: రోగులకు అత్యవసర సమయాల్లో మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామని 108 జిల్లా మేనేజర్ నాజీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావును గురువారం కలిసి ఇక్కడ అందుతున్న 108 సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 108 ద్వారా మంచి సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. తమ సిబ్బంది అన్ని వేళల్లోను మెరుగైన సేవలు అందిస్తున్నారని వివరించారు.



108 సేవలపై ఆరా తీస్తున్న మేనేజర్ నాజీర్ హుస్సేన్

కనీస వేతనం గిట్టుబాటు కావాలి

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు కనీస వేతనం గిట్టుబాటు కావాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు నిర్దేశించిన వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో ముందుగా కొలతలు ఇచ్చిన అనంతరం పనులు చేయించాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారులకు సంబంధించి ఎన్.ఎం.ఎం.ఎస్. యాప్ ద్వారా మస్టర్లలో అటెండెన్స్ వేయాలన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేతనదారులు రెండు పూటలా పనులలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. ఏపీఓ టి.రామకృష్ణనాయుడు, ఎఫ్ఏ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

వాహనాల తనిఖీ

భామిని: మండలంలోని ఏబీ రోడ్డుపై వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. పాలకొండ మోటారు ట్రాన్స్‌పోర్టు అధికారి(ఎంటీఓ) టి.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. స్టిక్కరింగ్ నంబరు ప్లేట్లు వాహనాలకు పెట్టడం నేరమన్నారు. హెచ్ఎస్ఆర్‌పీ నంబరు ప్లేట్లు పెట్టాలని సూచించారు. వాహనాల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

పౌష్టికాహారం సక్రమంగా అందాలి

కొమరాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీఓ ఎల్‌వీ అప్పారావు అన్నారు. ఉలిపిరి, రామభద్రపురంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఉలిపిరి సచివాలయంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు తీసుకువెళ్లాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని వైస్ ఎంపీపీ వట్రి విజయకుమారి సూచించారు. న్యూట్రీషియన్ డే సందర్భంగా తూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులకు గురువారం అవగాహన కల్పించారు. రక్తహీనత లేకుండా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రతీ నెలా చిన్నారుల బరువులు లెక్కించి అందుకు అనుగుణంగా పౌష్టికాహారం అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.



కొమరాడ: అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



షిర్డీసాయి పూజల్లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పాలక మండలి సభ్యులు

పాలకొండ రూరల్: స్థానిక పెద్దకాపు వీధిలో కొలువుదీరిన షిర్డీసాయి మందిర పదవ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. వైభవోపేతమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ క్రమంలో సాయి మందిరంలో విశేష పూజలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హిమరిక మోహనరావు, దుప్పా పాపినాయుడు, నీలాపు శ్రీనివాసరావు, కొంచడ అరుణ్ కుమార్, కోడెం విజయ్‌కుమార్, పల్లా భాను, తూముల లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ సవర రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో మెరుగైన సేవలు



కియోస్కో యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ వాహిని

పాలకొండ: రైతు భరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి వై.వాహిని తెలిపారు. మండలంలోని కొండాపురం ఆర్‌బీకే కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌బీకేలను పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కేంద్రాలకు కేటాయించిన పరికరాలను పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. రైతుల నుంచి సేవలపై అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపారు. మరింత మెరుగ్గా సేవలు అందించేలా తమ సిబ్బందికి సూచనలు అందించామన్నారు. ఆమెతో పాటు వీఏఏ సతీష్ ఉన్నారు.

సక్రమంగా భూసర్వే



చిన్నదిమిలిలో గ్రౌండ్ ట్రూథింగ్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

భామిని: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ సర్వే సక్రమంగా ఉండాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. మండలంలో కొనసాగుతున్న వైఎస్సార్ శాశ్వత భూ హక్కు – భూ సర్వే కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. తహసీల్దార్ నీలాపు అప్పారావుతో కలిసి చిన్నదిమిలి, నులకజోడు గ్రూప్‌లలో కొనసాగుతున్న భూసర్వే గ్రౌండ్ ట్రూథింగ్‌ను పరిశీలించారు. రైతులకు ఇచ్చిన సమాచార రికార్డులను గుర్తించారు. రైతుల అనుమానాలు నివృత్తి చేసి గుర్తించాలన్నారు. వారి వెంట సర్వేయరు, ఎంఆర్ఐ, వీఆర్‌ఓలు ఉన్నారు.

రేషన్ బియ్యంలో తరుగుదల

వీరఘట్టం: ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుండి రేషన్ డిపోలకు వస్తున్న బియ్యం బస్తాలు తూకంలో తక్కువగా ఉంటున్నాయని మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఒక్కో బియ్యం బస్తా 50.6 కిలోల బరువు ఉండాలని, మాకు వస్తున్న బియ్యం బస్తాలు 43 నుండి 45 కిలోలు వస్తున్నాయని తెలిపారు. డిపోలకు బస్తాలు వచ్చేటప్పుడు తూకం వేసి ఇమ్మంటే ఇవ్వకపోవడంతో ఆ మిగులు భారం డీలర్లపై పడుతుండడంతో తాము ఆర్థికంగా సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు స్పందిస్తూ ఇకపై అటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

యజ్ఞంలా.. చెత్త సేకరణ

- డీఆర్‌పీసీ వెంకటరావు

వీరఘట్టం: గ్రామాల్లో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా పారిశుద్ధ్య పరిరక్షణ జరగాలని, అందు కోసం ప్రతీ గ్రామంలో చెత్త సేకరణ ఒక యజ్ఞంలా చేపట్టాలని అది ఒక్క జగనన్న స్వచ్ఛ సంకల్పంతోనే సాధ్యమని జిల్లా రిసోర్స్ పర్సన్ వెంకటరావు సూచించారు. వీరఘట్టంలో ఉన్న చెత్తల సంపద కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ప్రభుత్వం గుర్తించడంతో ఇక్కడ చెత్తల సేకరణపై గురువారం వర్కుషాపు నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పలు పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్, వెటర్నరీ అసిస్టెంట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి చెత్తల సేకరణ చేయడంపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువు తయారీని ఏ విధంగా చేయాలో వివరించారు. కార్యక్రమాన్ని ముందుగా ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీడీఓ ఎ.ప్రభాకర రావు, సర్పంచ్ పులిటి గౌరమ్మ, ఈఓ వి.రామచంద్రరావు, జిల్లాలోని పలు పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, వెటర్నరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, స్థానిక గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు. ఇక నుండి ప్రతీ వారం ఇక్కడ పారిశుద్ధ్య పరిరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వర్కుషాపును ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

ఉపాధి పనుల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామంలో ఆకారం బందలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ చంద్రమ్మ గురువారం పరిశీలించారు. ఉపాధి వేతనదారులు ఉదయం 6 గంటలకే పనుల వద్దకు చేరుకోవాలని అన్నారు. రెండు పూటలా పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన వేతనం వస్తుందన్నారు. తప్పుడు మస్తర్లు నింపితే చర్యలు తప్పవన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతుల పేర్లను మస్తర్ల నుంచి తొలగించాలన్నారు. ఎంపీడీఓ రమేష్, ఏపీఓ సురేష్‌నాయుడు, ఈసీ తేజ ఉన్నారు.



పరజపాడులో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీడీ చంద్రమ్మ

చింతపండుకు తగ్గిన డిమాండ్

కురుపాం: స్థానిక మార్కెట్లో ఈ ఏడాది చింత పండుకు డిమాండ్ తగ్గిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కేజీ చింతపండు మార్కెట్లో రూ.40 వరకు ధర ఉండగా, ఈ ఏడాది కొత్త చింత పండుకు కేజీకు ధర రూ.30 నుంచి 36 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని గిరిజనులు చెబుతున్నారు. గురువారం జరిగిన వారపు సంతకు కురుపాం నియోజకవర్గంలోని జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల నుంచి గిరిజనులు కొత్త చింతపండు విక్రయానికి తెచ్చారు. డిమాండ్ తక్కువగా ఉండటంతో మంచి రకం చింత పండుకు రూ.36 లకు కొనుగోలు చేశారు. తడిచిన చింతపండుకు కేజీ రూ.30 లకు కొనుగోలు చేసినట్లు వ్యాపారులు తెలిపారు. వచ్చే నెల నుంచి మార్కెట్లో చింత పండు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు .



వారపు సంతలో చింతపండును కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల నుంచి శాఖా గ్రంథాలయానికి రావలసిన గ్రంథాలయ పన్ను బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు ఆదేశించారు. మండలంలోని గొట్టివలస, ఉద్దవోలు, దళాయివలస గ్రామ సచివాలయాలను గురువారం ఆకస్మికంగా సందర్శించి రికార్డులను, పన్ను వసూళ్లను పరిశీలించారు. గ్రామాలలో ఇంటి పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బి.చంద్రినాయుడు, వి.భూలక్ష్మి, జి.నారాయణమ్మ, శాఖా గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.



ఉద్దవోలు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

వనజ ఆశ్రమ పాఠశాల సందర్శన

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ ఏఎంఓ సిహెచ్.మోహనరాయుడు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల విద్యా స్థాయిని పెంచాలని సంబంధిత ఉపాధ్యాయులకు సూచించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి యాక్షన్ ప్లాన్ ప్రకారం విద్యార్థులను తయారు చేయాలన్నారు. ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్, టీచింగ్ డైరీ, సీసీఈ మార్క్స్‌రిజిష్టర్ చూశారు. విధి నిర్వహణలో అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ ఏఎంఓ మోహనరాయుడు

ట్రాన్స్ జండర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సీతంపేట: ట్రాన్స్ జండర్ల సమస్యను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో వారితో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వారికి అందేలా చూస్తామన్నారు. ఎటువంటి సమస్యలున్నా గ్రామ సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. స్పందన ద్వారా సమస్యలు తెలియజేస్తే త్వరితగతిన పరిష్కారమౌతుందన్నారు. ప్రస్తుతం రేషన్‌కార్డుల సమస్య ఉన్నందున రెవెన్యూ అధికారులతో చర్చిస్తామన్నారు. పింఛన్‌లకు కూడా ప్రతిపాదించామన్నారు. వైకేపీ, బ్యాంకుల ద్వారా జీవనోపాదులకు సంబంధించి సహకారం అందిస్తామన్నారు. ఎటువంటి శిక్షణలు కావాలన్నా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఈఓపీఆర్‌డీ కె.సత్యం, ఏపీడీ నారాయణరావు, ఎంఈఓ ఆనందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ప్రాక్టికల్ పరీక్షలకు సంసిద్ధం కావాలి

పాలకొండ రూరల్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఐఈఓ డి.మంజుల వీణ అన్నారు. పాలకొండ గురువారం వచ్చిన ఆమె స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల చివరి వారంలో సైన్స్ విద్యార్థులకు ప్రారంభం కానున్న ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రయోగ పరీక్షలకు అవసరమగు సామగ్రిని కళాశాలలు సిద్ధం చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో 21 కేంద్రాల పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించామని, ఒత్తిడి లేకుండా విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. అనంతరం కళాశాలల్లో జరుగుతున్న నాడు – నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.కుమారస్వామి, ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు వెలమల అప్పారావు, శివ, వెంకటేశ్వర్లు, రమేష్, విజయగౌరి, రోహిణి లత తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో జై గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డిసాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురుదత్త హోమాలు ఘనంగా జరిగాయి. ఈమేరకు ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి తదితర పూజలు నిర్వహించారు. బాబాకు విశేష అర్చనలు, అభిషేకములు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్ఎన్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీజైగురుదత్త హోమాలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హోమములో పాల్గొన్న దంపతులకు దీక్షా వస్త్రాలను కమిటీ సభ్యులు అందజేశారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న దంపతులు